ప్రజాశక్తి
ఆదివారం 14 సెప్టెంబరు, 2025
5
శ్రీకాకుళం

## కొత్తమ్మతల్లి ఉత్సవాల కోసం వీడియో పోటీలు

**శ్రీకాకుళం సిటీ:** ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఉత్సవాల కోసం వీడియో పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి వైభవం, చరిత్ర, గత ఉత్సవాల జ్ఞాపకాలు, అన్ని విషయాలను ప్రతిబింబించేలా మూడు నుంచి ఐదు నిమిషాల నిడివి గల వీడియోలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయి కుమార్ ఈ-మెయిల్ dsdosrikakulam@apssdc.inకు ఈనెల 16వ తేదీ లోగా పంపాలని తెలిపారు. ఉత్తమంగా ఎంపికైన వీడియోలకు రూ.ఐదు వేలు, రూ.మూడు వేలు, రూ.రెండు వేల నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. బహుమతులను వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా జాతర సందర్భంగా విజేతలకు అందజేయనున్నట్లు తెలిపారు.

# సమస్యల పరిష్కారానికి కొత్త 'ఆశ'

**అసలే అత్తెసరు పారితోషికం... జాబ్‌ఛార్టులో లేని పనులు అప్పగింత... వీటికితోడు గ్రామాల్లో రాజకీయ వేధింపులు ఇవీ ఆశావర్కర్లు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు. వీటిపై సిఐటియు ఆధ్వర్యాన చేసిన పోరాటాలతో వారి సమస్యలు కొంతవరకు పరిష్కారమైనా, ఇంకా కొన్ని వారిని వెంటాడుతూనే ఉన్నాయి. ఆశాల విధులకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చినా, జిల్లాలో ఇంకా సక్రమంగా అమలు కాని పరిస్థితి నెలకొంది. కొన్ని గ్రామాల్లో వారి పోస్టులకు వేలంపాటలు నిర్వహిస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్న పరిస్థితులూ లేకపోలేదు. రెండేళ్ల కాలంలో సాగించిన పోరాటాలను సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడానికి శ్రీకాకుళం నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆశావర్కర్స్ యూనియన్ 6వ జిల్లా మహాసభలో చర్చించేందుకు సిద్ధమవుతున్నారు.**

- **చాలీచాలని పారితోషికంతో ఆర్థిక ఇబ్బందులు**
- **జాబ్‌ఛార్టులో లేని పనులు అప్పగింత**
- **భావి పోరాటాలకు సిద్ధవుతున్న ఆశావర్కర్లు**
- **శ్రీకాకుళంలో నేడు ఆశావర్కర్స్ యూనియన్ 6వ జిల్లా మహాసభ**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా వైద్యారోగ్యశాఖలో 2,170 మంది ఆశావర్కర్లు పనిచేస్తున్నారు. క్షేత్రస్థాయిలో వీరు చాలా కీలకంగా వ్యవహరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యి నుంచి రెండు వేల కుటుంబాలకు, అర్బన్ ప్రాంతాల్లో మూడు వేల కుటుంబాల వరకు వీరు సేవలందిస్తున్నారు. నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్, లెప్రసీ, ఫీవర్ తదితర సర్వేల్లో వీరు భాగస్వామ్యమవుతున్నారు. జిల్లాలో వీరికి జాబ్‌ఛార్టులో లేని పనులు అప్పగిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. వాస్తవానికి వీరు గ్రామాల్లో మాతాశిశు సంరక్షణ కార్యక్రమం కింద ఇంటింటికీ వెళ్లి తల్లీబిడ్డలు, గర్భిణుల సమాచారాన్ని తెలుసుకుని వైద్యులకు చేరవేస్తారు. వారి ద్వారా చికిత్స, వైద్య సలహాలు అందించడం వంటి పనులు చేస్తారు. వీరిపై అటు సచివాలయం, రెగ్యులర్ ఎఎన్ఎంలు పెత్తనం సాగిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. తాము చెప్పినట్లు వినాలంటూ ఇద్దరూ పట్టుబడుతుండడంతో, ఒక్కోసారి ఏం చేయాలో వారికి తోచడం లేదు. ఆరోగ్యం బాగా లేకున్నా, వీరికి సెలవు దొరకడమూ కష్టంగా మారింది.

**పోరాడి సాధించిన విజయాలు ఇవే...**

సంతబొమ్మాళి మండలం బోరుభద్ర పిహెచ్‌సి పరిధిలోని గెద్దలపాడులో ఆశావర్కర్ పోస్టుకు రూ.1.50 లక్షలతో వేలంపాట నిర్వహించాలని గ్రామపెద్దలు నిర్ణయించడాన్ని ఆశావర్కరు అంగీకరించకపోవడంతో, గ్రామ పెద్దలు ఆమెను అనధికారికంగా వెలి వేశారు. యూనియన్ చేపట్టిన ఆందోళనలు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రాలు అందించిన తర్వాత గ్రామ పెద్దలు వెనక్కి తగ్గారు. పలాసలోని కిష్టుపురంలో బిపి మాత్రలు కావాలని ఇంటికి వెళ్లి దాడి చేసిన ఘటనపై యూనియన్ నాయకులు ఎమ్మెల్యే గౌతు శిరీష, డిఎస్‌పిని కలవడంతో కేసు నమోదు చేశారు. టెక్కలిలోని కె.కొత్తూరు పిహెచ్‌సిలో ఎఎన్ఎం వేధింపులు భరించలేక లీలావతి అనే ఆశావర్కర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై యూనియన్ నాయకులు ఆందోళన చేయడంతో, ఎఎన్ఎంపై డిఎంహెచ్ఒ చర్యలు తీసుకున్నారు. వీటితోపాటు రాష్ట్రవ్యాప్తంగా సాగించిన పోరాటాలతో వేతనంతో కూడిన ఆరు నెలల పాటు ప్రసూతి సెలవులు, 62 ఏళ్ల వయో పరిమితి, రూ.1.50 లక్షల గ్రాట్యుటీ, గ్రూప్ ఇన్సూరెన్స్ వంటి అంశాలను సాధించుకున్నారు. గ్రామాల్లో చిన్నారులకు వ్యాక్సిన్ ఇచ్చే సమయాల్లో వీరిచేత కిట్లు మోయిస్తున్న పరిస్థితి ఉంది. ఆశావర్కర్లు చేపట్టిన అనేక ఆందోళనల ఫలితంగా కిట్ల మోత నుంచి ప్రభుత్వం ఉపశమనం కలిగించింది.

**ప్రధాన డిమాండ్లు ఇవే...**

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆశావర్కర్లు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన అన్ని సెలవు దినాలను వర్తింపజేయాలని వారు అడుగుతున్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అజశర్మ

## ప్రకృతి వనరుల సద్వినియోగంతో...
# ఉద్దాన ప్రాంతం అభివృద్ధి

**ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ. అజశర్మ**

ప్రజాశక్తి - పలాస

ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఉద్దాన ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ సూచించారు. మెరుగైన జీవన ప్రమాణాలు, ఉపాధి, నాణ్యమైన విద్య, వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాశీబుగ్గలోని ఒక భవనంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యాన జుత్తు సింహాచలం అధ్యక్షతన 'ఉద్దానం ప్రాంత అభివృద్ధి - అవకాశాలు, అవరోధాలు' అనే అంశంపై శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడికి గిట్టుబాటు ధర కల్పించి 80 కేజీల బస్తా రూ.16 వేలకు రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా ఉద్దాన ప్రాంతంలో జీడి బోర్డుతో పాటు జీడి పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కొబ్బరి బోర్డుతో పాటు జీడి, కొబ్బరినార సహకార పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఉద్దాన ప్రాంతంలో ఉద్యాన పంటలపై జీవనం సాగిస్తున్నారని, మరింత ఎక్కువ సాగుకు అనుగుణంగా ఉచితంగా మొక్కలు, ఎరువులు, పురుగుమందులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఏటా పంటలకు రుణ సదుపాయం కల్పించాలన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఉద్దాన ప్రాంతంలో అత్యధికంగా వర్షపాతం నమోదవుతుందని, దాన్ని వినియోగించుకుని పంటలు పండించుకునేందుకు ప్రభుత్వం అవకాశాలు కల్పించాలని సూచించారు. ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధితో యువకుల నుంచి వృద్ధుల వరకు ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని, కిడ్నీ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పలాస కిడ్నీ ఆస్పత్రిలో కిడ్నీ వ్యాధిపై పూర్తిస్థాయిలో పరిశోధనలు చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వం చొరవ చూపి పరిశోధనలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. పలాస మండలం రేగులపాడు వద్ద నిర్మాణం చేపడుతున్న ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేసి ఏళ్లు గడుస్తున్నా, నేటికీ పూర్తి కావడం లేదన్నారు. త్వరితగతిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి చేసి పలాస, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి మండలాలకు సాగునీరందేలా చర్యలు చేపట్టాలన్నారు. వంశధార ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు చేపట్టి ఇచ్ఛాపురం వరకు పొడిగించి శివారు భూములకు నిరంతరం సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలన్నారు. మత్స్యకారులకు ఉపాధితో పాటు రక్షణ కల్పించాలని కోరారు. ఉద్దాన ప్రాంతంలో నైపుణ్యాభివృద్ధి, సైనిక శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్దాన ప్రాంతంలో కేంద్రీయ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కో కన్వీనర్ జుత్తు సింహాచలం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ కొత్తకోట అప్పారావు, కో కన్వీనర్ పాలవలస ధర్మారావు, వైద్యులు డాక్టర్ ఖగేశ్వర రావు, జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, వంశధార జల సాధన కమిటీ ఉపాధ్యక్షులు కె.హేమారావు చౌదరి, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# లోక్‌అదాలత్‌లో 2,305 కేసులు రాజీ

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా**

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

**శ్రీకాకుళం లీగల్:** జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 2,305 కేసులు రాజీ అయినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ కేసులు 104కు గానూ రూ. 68,310,419, 2174 క్రిమినల్ కేసులకు రూ.52,81,673, 27 ప్రీ లిటిగేషన్ కేసులకు రూ.11,93,300 రాజీ అయినట్లు వెల్లడించారు. లోక్ అదాలత్ ద్వారా ప్రజలు తక్కువ ఖర్చుతో, వేగంగా న్యాయం పొందగలరని తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసు రాజీ అయితే ఇరు పక్షాలకూ గెలుపే ఉంటుందని తెలిపారు.

# యూరియా కోసం తప్పని అవస్థలు

- **పాలవలసలో స్వల్ప తోపులాట**
- **పోలీసుల సమక్షంలో పంపిణీ**

పాలవలసలో యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

ప్రజాశక్తి- బూర్జ

యూరియా కోసం స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. సక్రమంగా యూరియా అందజేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు ముందుగా రైతులకు కూపన్లు అందజేశారు. దీనికి సంబంధించి శనివారం 9 గంటలకు మండలంలోని పాలవలస, ఉప్పినివలస, చీడివలస గ్రామాల్లో కూపన్లు అందుకున్న రైతులకు యూరియా పంపిణీకి ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక పోలీసు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, మండల వ్యవసాయశాఖ అధికారులు రైతు సేవా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఉదయం ఎనిమిది గంటలకే రైతులు యూరియా కోసం ఆయా గ్రామాల్లో బారులు తీరారు. పాలవలసలో ఎక్కువ మంది రైతులు చేరడంతో మరి యూరియా దొరకదేమోనని ఆందోళన చెంది ఆయా రైతు సేవా కేంద్రాల్లో చొచ్చుకుపోయారు. దీంతో పాలవలసలో స్వల్ప తోపులాటకు దారితీసింది. అదుపు చేయడానికి పోలీసులు, రెవెన్యూ, సచివాల సిబ్బంది ప్రయత్నించారు. కూపన్లు ఉన్న రైతలందరికీ యూరియా పంపిణీ చేస్తామని ప్రచారం చేశారు. అయినా రైతు సేవా కేంద్రంలోకి దూసుకుపోయారు. దీంతో కొంతసేపు యూరియా పంపిణీకి ఆటంకం ఏర్పడింది.

**సొమ్మసిల్లిన మహిళ**

ఉప్పినివలసలో యూరియా కోసం రైతులు ఉదయం నుంచే క్యూ కట్టారు. కూపన్లు అందుకున్న రైతులు ఎక్కువ సేపు ఎండలో క్యూలో ఉన్నారు. మండలంలోని సింగన్నపాలెంకు చెందిన కుంక అన్నపూర్ణలు క్యూలో నిల్చొని సొమ్మసిల్లి కింద పడిపోయింది. వెంటనే పోలీసులు స్పందించి ఆమెకు సపర్యలు చేసి ఇంటికి పంపించారు. అనంతరం ఎస్ఐ ప్రవళిక ఆధ్వర్యాన ఎఒ డి.ఉషారాణి పర్యవేక్షణలో రైతులకు యూరియా పంపిణీ చేశారు.

# ప్రణాళికలు సిద్ధం చేయాలి

**ఎమ్మెల్యే రవికుమార్**

సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలోని వంశధార, నాగావళి నదుల అనుసంధానంతో పాటు ప్రధాన సాగునీటి కాలువలు, జలాశయాలు, చెరువులను అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వంశధార, నాగావళి విభాగాల ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు చెల్లించాల్సిన బిల్లులు, ఆధునికీకరణకు అవసరమైన నిధుల అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వంశధార కుడి ప్రధాన కాలువ, నాగావళి, వంశధార అనుసంధాన పనులు, సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలస, బొమ్మిక జలాశయాలు, పొందూరు మండలంలోని రెల్లిగడ్డ, బూర్జ మండలంలోని ఓనిగడ్డ ప్రధాన కాలువలు వంటి ప్రాజెక్టులపై సమగ్ర వివరాలతో నివేదికలు రూపొందించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఖరీఫ్‌సాగు చేస్తున్న అన్నదాతలకు ఎటువంటి సాగునీటి ఇబ్బందులు రాకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవితో పాటు అన్ని శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రెడ్డి శాంతి

## మహిళలకు భద్రత కరువు

**మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి**

ప్రజాశక్తి- కొత్తూరు

రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని వైసిపి రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను టిడిపి కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళా సాధికారత పూర్తిగా కరువైందన్నారు. మహిళలపై దారుణాలు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయన్నారు. 'ఆడబిడ్డ నిధి' పథకం కింద 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని హామీ ఊసే లేదన్నారు. ఇది మహిళలను మోసం చేయడమేనని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం మహిళా వ్యతిరేకమన్నారు. వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన పలు సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ మహిళా ఆర్థిక స్వాతంత్ర్యాన్ని దెబ్బతీస్తోందని అన్నారు. రాష్ట్రంలో మహిళల రక్షణ కరువైందని, శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా దిగజారిందని ఆందోళన వ్యక్తం చేశారు జగనన్న మహిళలను ఇంటి యజమానురాలుగా మార్చేందుకు కృషి చేశారని అన్నారు. ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా ఆర్థికంగా వారిని బలోపేతం చేశారని గుర్తు చేశారు. దిశ చట్టం తీసుకొచ్చి మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. గ్రామ సచివాలయాల వ్యవస్థలో మహిళా పోలీసులను నియమించి, గ్రామీణ స్థాయిలో వారికి రక్షణ కల్పించని తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే మహిళలను ఉపయోగించుకున్నారు తప్ప, వారి భద్రతకు, సాధికారతకు ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు.

నిందితులను ప్రవేశపెట్టిన డిఎస్‌పి

## గంజాయితో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఐదు కేసుల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కాశీబుగ్గ డిఎస్‌పి వెంకట అప్పారావు తెలిపారు. సిఐ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. తమిళనాడుకు చెందిన మిథున్ కుమార్, ఉదయ్ కుమార్, ముత్తు రామలింగం గంజాయిని తరలించేందుకు రైల్వే స్టేషన్‌లో ఉన్నారని అన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు రైల్వే స్టేషన్‌కు చేరుకుని పరిశీలించగా ఐదు కేసుల గంజాయి పట్టుబడిందని అన్నారు. వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు. గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలపై గట్టి నిఘా పెట్టామన్నారు. సమావేశంలో సిఐ మీసాల చిన్నంనాయడు, టౌన్ ఎస్ఐ ముకుందరావు పాల్గొన్నారు.

# యూరియా ఇవ్వలేక రైతులకు పాఠాలా?

వీక్షణం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో యూరియా కొరత ఏ స్థాయిలో ఉందో ఇటీవల కాలంలో మనం చూస్తున్నాం. రైతులు పొలాలను వదిలేసి పంపిణీ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్న పరిస్థితి అన్నిచోట్లా కనిపిస్తోంది. ఒక బస్తా యూరియా దొరికితే అదే పది వేలు అని రైతులు అనుకుంటున్నారు. కొన్నిచోట్ల అధిక ధర చెల్లించి ప్రైవేట్ వ్యాపారుల వద్ద కొంటున్న పరిస్థితి నెలకొంది. ఫలానా పంపిణీ కేంద్రానికో, ప్రైవేట్ దుకాణాలకో యూరియా వచ్చిందని తెలియగానే పరుగులు తీస్తున్నారు. పొలం పనులు, భోజనం మానేసి క్యూ కడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో యూరియా కోసం రైతులు అవస్థలు పడడానికి ప్రభుత్వ విధానం, ఉదాసీనమే కారణంగా కనిపిస్తోంది. జిల్లా అవసరాలకు సరిపడా యూరియా పంపకుండా ప్రభుత్వం కోత పెట్టింది. ఖరీఫ్ మొత్తానికి 42,225 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపితే, అందులో కోత పెట్టి జిల్లాకు 21,840 మెట్రిక్ టన్నులు పంపింది. యూరియా పంపిణీ విషయంలో ప్రభుత్వంపై రైతుల్లో ఆగ్రహం నెలకొనడంతో కొసరి కొసరి రెండు విడతల్లో మరో మూడు వేల మెట్రిక్ టన్నులను జిల్లాకు పంపింది. యూరియా కొరతపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా వస్తున్న వార్తలను తిప్పికొట్టేందుకు ప్రభుత్వం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో ప్రెస్‌మీట్ పెట్టించి, జిల్లాలో యూరియా కొరత ఏమీ లేదని చెప్పించే ప్రయత్నం చేసింది. ఆ తర్వాత నుంచి యూరియా కొరత తీవ్రతకు అద్దం పట్టేలా పంపిణీ కేంద్రాల వద్ద బారులు తీరిన రైతులు, రైతులతో కిక్కిరిసిపోయిన రైతు సేవా కేంద్రాల చిత్రాలు పత్రికల్లో వచ్చాయి. మంత్రి అచ్చెన్నాయుడు సంతబొమ్మాళి మండలం పర్యటనలో ఒకసారి, శ్రీకాకుళం మండలం సింగుపురంలో ఆర్ఎస్‌కెలో ఎరువుల పంపిణీ పరిశీలనకు వచ్చిన సందర్భంలో మరోసారి యూరియా కొరత లేదని, జిల్లా అవసరాలకు సరిపడ నిల్వలు ఉన్నాయంటూ సమర్థించుకునే ప్రయత్నం చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు యూరియా కొరత లేదని చెప్పిన తర్వాత జిల్లాలో మరిన్ని ప్రభుత్వ పంపిణీ కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్న చిత్రాలు పత్రికల్లో వచ్చాయి. యూరియా కొరత లేదని చెప్పడంతో ఆగకుండా, యూరియా వాడకం తగ్గించుకుంటే రైతులకు ఖర్చు తగ్గుతుందని సలహా ఇచ్చి పడేశారు. యూరియా బస్తాకు కేంద్రం రూ.800 సబ్సిడీ ఇస్తోందని, దాన్ని ఎంత తగ్గించుకుంటే రాష్ట్రానికి ఆదాయం పెరుగుతుందని, దాన్ని రైతులకు పంచుతామని చెప్తున్నారు. యూరియా ఇవ్వలేని వారు డబ్బులు ఇస్తారని చెప్పడంపై రైతులు నవ్వుతున్నారు.

యూరియా కొరత తీవ్రతరమవుతున్న నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రతిరోజూ అదే పనిలో ఉన్నారు. డయల్ యువర్ కలెక్టర్‌తో పాటు రైతులతో ముఖాముఖి నిర్వహిస్తున్నారు. కొంతమంది రైతులను నేరుగా కలుసుకోవడంతో పాటు మరికొంతమందితో వర్చువల్‌గా మాట్లాడారు. యూరియా వాడకం, కొరత లేదని చెప్పే ప్రయత్నం చేశారు. రైతుల సమస్యలను తెలుసుకోవడం మంచిదే గానీ రైతులకే పాఠాలు చెప్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎకరాకు 25 కేజీల యూరియా వాడితే సరిపోతుందన్న కలెక్టర్ మాటలకు కొన్నిచోట్ల రైతుల నుంచి గట్టిగానే బదులు వచ్చింది. ఆమదాలవలస మండలం వంజంగిలో ఎరువుల దుకాణ సందర్శనకు వెళ్లిన కలెక్టర్ అక్కడి రైతులతో మాట్లాడిన సందర్భంగా తాము ఎకరాకు బస్తా యూరియా వేయాల్సిందేనని, దానికే తాము అలవాటు పడ్డామంటూ సూటిగా చెప్పడంతో అక్కడున్న వారు ఒకింత షాక్‌కు గురయ్యారు.

యూరియా కావాలని రైతులు అడుగుతుంటే... యూరియా వాడకం తగ్గిస్తే ఖర్చు తగ్గుతుందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒకవైపు చెప్తుంటే, వాడకం తగ్గించాలని కలెక్టర్ రైతులకు సలహాలు ఇస్తున్నారు. వ్యవసాయంలో ఆరితేరిన రైతులకే సలహాలు ఇవ్వడం విచిత్రంగా ఉంది. వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు తానూ ఒక రైతు బిడ్డే కావచ్చు, ఇప్పుడు ఆయన వ్యవసాయ విధానాలను అమలు చేసే పాలకవర్గం ప్రతినిధిగానే మాట్లాడుతున్నారన్నది ఆయన ప్రకటనల సారాంశం పరిశీలిస్తే తేటతెల్లమవుతోంది. పంటను కాపాడుకోవడానికి రూ.270 యూరియా బస్తాను రూ.500 చెల్లించి రైతు కొంటుంటే, కేంద్రం బస్తాకు ఇచ్చే రూ.800 సబ్సిడీ రాష్ట్ర ప్రభుత్వానికి మిగులుతుందని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పడం పాలకవర్గం ఆలోచనల స్వభావానికి అద్దం పడుతోంది. యూరియా వాడకంపై కలెక్టర్ అదే పనిగా చెప్తుండడం రైతులకు విసుగు పుట్టిస్తోంది. వరి పంటకు ఎకరాకు 25 కేజీల యూరియా వాడాలని శాస్త్రవేత్తలు చెప్పిన మాట వాస్తవమే అయినా, కాలానుగుణ మార్పులతో దాన్ని అధిక పరిమాణంలో వాడాల్సి వస్తోందన్న విషయాన్ని అధికారులు విస్మరిస్తున్నట్లు కనిపిస్తోంది. గతంలో నాట్లు వేసే పరిస్థితి ఉండగా, ఇప్పుడు 90 శాతం మేర వెదలే జల్లుతున్నారు. దమ్ము పట్టేటప్పుడు భూమి చదును, పైరుకు నీటిని పట్టుకునే సామర్థ్యం, నారుకు అంటిపెట్టుకుని ఉండే పోషకాలు ఉండేవి. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో యూరియా వాడాల్సి వస్తోంది. వరి పంటకు సాధారణంగా 34 కేజీల నత్రజని వాడాలని శాస్త్రవేత్తలే చెప్తున్నారు. ఒక బస్తా (50 కేజీలు) యూరియాలో 46 శాతం నత్రజని ఉంటుందని గుర్తించిన తర్వాత మరి 23 కేజీల నత్రజని ఏ మూలకు సరిపోతుంది? ఇది అధికారులకు తెలియదా?. ఈ ఏడాది ఖరీఫ్‌లో విత్తనాలు వేసిన తర్వాత వర్షాలు లేకపోవడం, కలుపు పెరిగిపోవడం, కలుపు మందుల వాడకంతో పంటపై ప్రభావం చూపడం వంటి కారణాలతో రైతులు అధికంగా యూరియా వాడాల్సిన అవసరం ఏర్పడిందన్న విషయాన్ని అధికారులు గుర్తించినట్లు లేదు. వీటిని విస్మరించిన వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్, వ్యవసాయశాఖ అధికారులు యూరియా వాడకంపై కొత్త భాష్యాలు చెప్పడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపెట్టేందుకు పడుతున్న తాపత్రయంగానే ఉందని రైతులు అనుకుంటున్నారు.

**డాక్యుమెంట్ పోయినది**

నేను గండెమ్ కరుణ W/o కిరణ్ ఫనిరాజ్, హిందు, వయస్సు 38 సం॥లు, నివాసం డోర్ నెం.16-23-8, PN కాలనీ 10 వ లేన్, శ్రీకాకుళం పట్టణం మరియు జిల్లా. నేను తేది 02.09.2025 నాడు నా నివాస ఇంటి నుండి 7 రోడ్స్ జంక్షన్ వరకు ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు నా నివాస ఇంటి రిజిస్టర్డ్ లింకు డాక్యుమెంట్ నెం: 7070/2014 పోయినది. 2 టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అదే రోజున నా యొక్క పోయిన దస్తావేజును వెతికి ఇప్పించవలసినదిగా కోరుచూ ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. కావున ఎవరికైనా దొరికినట్లయితే దయచేసి నాకు తెలియజేయగలరని కోరుతున్నాను.

**జి. కరుణ**

పి.ఎన్.కాలనీ, శ్రీకాకుళం. సెల్: 9490267267

మాట్లాడుతున్న ప్రసాదరావు

## బస్సులు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు పల్లె వెలుగు బస్సు సర్వీసులు తక్షణమే పునరుద్ధరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాదరావు డిమాండ్ చేశారు. మండలంలో గొట్టిపల్లి పంచాయతీలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రవాణా సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఆర్‌టిసి అధికారులు కొత్తూరు-గొట్టిపల్లి, పూతికవలస-హడ్డుబంగి, ఆర్.కె.పూరం-అంగూరు, కొత్తూరు-పాతపట్నం, కొత్తూరు-టెక్కలి, కొత్తూరు-హడ్డుబంగి మార్గాల్లో బస్సు సర్వీసులను ప్రారంభించి ప్రజలకు ఉపయోగపడేలా చేశారని అన్నారు. తరువాత కాలంలో ఈ మార్గాల్లో సర్వీసులు రద్దు చేయడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించిందన్నారు. మహిళలకు స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్న ప్రభుత్వం, ఈ పాత బస్సు మార్గాలను మళ్లీ ప్రారంభిస్తే ప్రజలకు మరింత ఉపయోగం కలుగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పల్లె వెలుగు బస్సులు పునరుద్ధరించడం అత్యవసరమని ప్రభుత్వాన్ని సిపిఎం డిమాండ్ చేస్తోందని స్పష్టం చేశారు. సమావేశంలో సిపిఎం నాయకులు నిమ్మక అప్పన్న, దుర్గారావు, జమ్మయ్య, రమేష్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌పిని కలిసిన ఎస్‌ఐ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఎస్‌పికి మొక్కను అందజేస్తున్న ఎస్‌ఐ

ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం మహిళా పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వి.రామారావు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మహిళా పోలీస్‌స్టేషన్‌కు సమస్యలతో వచ్చే మహిళా ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి సత్వరమే న్యాయం చేకూర్చాలని సూచించారు. ప్రస్తుతం ప్రభుత్వం మహిళా భద్రతకు ప్రాధాన్య నిస్తుందనిన్నారు. మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

## పరిమళించిన దాతృత్వం

### 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

**మెళియాపుట్టి :** మండలంలోని పెద్దలక్ష్మీపురానికి చెందిన అదపాకల ఏకాంబరం కిడ్నీ, ఊపిరితిత్తులతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఆర్థికస్థోమత లేకపోవడంతో దాతల సాయం కోసం తల్లిదండ్రులు ఎదురుచూశారు. యువకుని దీనగాదన శుక్రవారం 'దాతల కోసం ఎదురుచూపులు' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి పలువురు దాతలు స్పందించి.. యువకుని వైద్యానికి తమ వంతు ఆర్థికసాయంగా అందించారు. పలువురు దాతలు బాధితునికి కుటుంబానికి రూ.1.50 లక్షలు శనివారం ఆర్థికసాయం అందించారు. దాతలు ముందుకొచ్చి యువకుని వైద్యం కోసం ఆర్థికసాయం చేయాలని కోరుతున్నారు.

సన్మానాలు చేస్తున్న తూర్పుకాపు ఉద్యోగ సంక్షేమ సంఘం నాయకులు

## ఐక్యతతో ముందుకు సాగుదాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

తూర్పు కాపు ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పదోన్నతులు పొందిన, విశ్రాంత ఉద్యోగులు, వివిధ రంగాల్లో పదవులు పొందిన వారికి శనివారం నగరంలో ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో సామూహిక సన్మానాలు చేశారు. ఎంఇఒగా ఉద్యోగ విరమణ చేసిన గెడ్డాపు రాజేంద్ర ప్రసాద్, హెచ్‌ఎంలుగా ఉద్యోగ విరమణ చేసిన దాసరి రామచంద్ర, బోడసింగి ఖగేశ్వరరావు, మెంటాడ సాంభమూర్తి, అలాగే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బౌరోతు శంకరరావు, ఇటీవల హెచ్‌ఎంగా పదోన్నతి పొందిన మక్కా శ్రీనివాసరావు, మీసాల శ్రీనివాసరావు, తలగాన లింగరాజు, కిల్లాన రాంబాబు, రాజాపు శ్రీనివారావు, కర్నేన రమణమూర్తి, ఇటీవల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందిన గొంటి తిరుపతిరావు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన బాడాన.రాజు, శిష్టి వెంకటరావు, మెప్మా పీడీ, హెచ్‌ఎం చెల్లి వెంకటరమణ, ఉద్యోగ సంఘాల నాయకులు కిల్లారి నారాయణ రావు, వాళ్లేటి సత్యనారాయణలను సత్కరించారు. డిఎస్‌సిలో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన లంక చక్రపాణికు ఘనంగా సత్కరించారు. జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు రాడ కైలాసరావు, శాసపు జోగినాయుడు, వాన కృష్ణచంద్, మామిడి క్రాంతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శామ్యూల్ అరుణ్ కుమార్

## ఐక్యతతో ముందుకు సాగాలి

**ఆమదాలవలస:** జిల్లా ఫాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ కార్యవర్గ సమావేశం బేతేలు చర్చ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెవరెండ్ శామ్యూల్ అరుణ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ బరియల్ గ్రౌండ్ల స్థలాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని, ప్రభుత్వం ఇస్తున్న పాస్టర్ల గౌరవ వేతనాన్ని తక్షణమే విడుదల చేయాలని, తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాస్టర్లను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రతిపాటి ప్రసాద్, సువార్త కోఆర్డినేటర్ బ్రదర్ అసిర్ కుమార్, ఉపాధ్యక్షులు రావి సూర్యనారాయణ, కోశాధికారి జాన్ పీటర్, సహాయ కార్యదర్శులు రమేష్, మధు, మున్సిపాలిటీ అధ్యక్షులు జి.డి.పాలు, కార్యదర్శి చంద్రశేఖర్ పట్నాయక్, భీమపాలక కృష్ణారావు, వెల్ఫేర్ కోఆర్డినేటర్ జోసెఫ్, నాలుగు మండలాల ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.

## హిందీ పండితులను నియమించాలి

**వజ్రపుకొత్తూరు:** ప్రాథమిక స్థాయి నుంచే హిందీ భాషా పండితులను నియమించి హిందీ భాషాభివృద్ధికి తోడ్పాటు అందించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు అన్నారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆదివారం హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాథమిక స్థాయి నుంచే హిందీ భాషా పరిజ్ఞానం పిల్లలకు అవసరమన్నారు. అప్పుడే హైస్కూళ్లల్లో ఉన్నతమైన విద్యా ప్రమాణాలు సాధించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. హిందీ పండితులకు ఉద్యోగోన్నతులు కల్పించి స్థిరమైన హోదా, స్థానాలు ఇవ్వాలన్నారు. వారు ఒకచోట ఉద్యోగం, ఇంకొక చోట జీతం తీసుకుంటూ నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని ప్రభావం పిల్లల విద్యాబోధనపై పడుతుందన్నారు. అందువల్ల ప్రభుత్వం భాషా పండితులకు ఉద్యోగోన్నతులు కల్పించి, సమస్యను పరిష్కరించాలని కోరారు.

# లోక్ అదాలత్‌తో సమన్యాయం

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు : లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి జ్యోత్స్న

లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకోవడం ద్వారా ఇరువర్గాలకు సమన్యాయం జరుగుతుందని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. స్థానిక జ్యుడిషియల్ ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 206 కేసులను పరిష్కరించగా ఇందులో 9 సివిల్, 25 క్రిమినల్, 40 మోటార్ వెహికల్, ఒకటి ఎన్ఐ యాక్ట్, 112 పెట్టీ కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ మెంబర్ బి.మంజుల, న్యాయవాదులు బ్రహ్మజీ, అశోక్, రాము, రామ్మోహన్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

**సోంపేట :** సోంపేట కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 64 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు తెలిపారు. ఒకటో బెంచ్‌ను జడ్జి శ్రీనివాసరావు, రెండో బెంచ్‌ను జడ్జి కె.శ్రీనివాస్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిమినల్ కేసులు 24, మనోవర్తి కేసు ఒకటి, సివిల్ దావాలు 8, డివిసి ఒకటి, ఎస్‌టిసి ఒకటి, ఇపి ఒకటి కేసులను పరిష్కరించామన్నారు. అలాగే ఎక్సైజ్ కేసులు 28 పరిష్కరించినట్లు తెలిపారు. డిఎస్‌పి వెంకట అప్పారావు సందర్శించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎన్.ఎస్. విజయకుమార్, డి.జోగారావు, కక్షిదారులు పాల్గొన్నారు.

**పలాస :** పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జడ్జి యు.మాధురి అధ్యక్షతన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 225 కేసులు రాజీ అయ్యాయి. అందులో క్రిమినల్ జెరిమానా కేసులు 145, సివిల్ దావాలు 6, క్రిమినల్ కేసులు 33, చెక్ బౌన్స్ కేసులు 7, మనోవర్తి కేసులు రెండు, గృహహింస కేసులు ఒకటి, ఎక్సైజ్ కేసులు 27, ప్రీ లిటిగేషన్ కేసులు నాలుగు కేసుల రాజీ అయ్యాయి. దీని ద్వారా రూ.15,22,968, అపరాధ రుసుం సుమారు రూ.2,88,900 వచ్చింది. ఎక్సైజ్ కేసుల్లో రూ.1,61,968 వసూలు అయ్యాయి. మెంబర్లుగా న్యాయవాదులు పి.రాజారత్నంనాయుడు, ఎన్.వి.రమణ వ్యవహరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు మహమ్మద్ ఫయాజ్ అహ్మద్ (ఘని), ఉపాధ్యక్షులు బి.కామేశ్వరరావు పట్నాయక్, సీనియర్ న్యాయవాదులు టి.మురళీమోహన్, పి.లక్ష్మీనారాయణ, కె.మన్మథరావు, కె.దేవరాజు, వి.రవికుమార్, బి.కాళిదాస్, జి.ఎం.ఎస్.అనిల్‌రాజు, అంది రామకృష్ణ, కె.లోకేశ్వరరావు, కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు, కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ, రూరల్ సిఐ తిరుపతిరావు, కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు ఎస్ఐలు నరసింహ మూర్తి, నిహార్, ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం :** కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి పి.పరీష కుమార్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో 200 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ కేసుల ద్వారా రూ.77 లక్షలు వసూలయ్యాయి. కార్యక్రమంలో పలాస డిఎస్‌పి వెంకట అప్పారావు, న్యాయవాదులు భైరాగిరెడ్డి, రమణయ్యరెడ్డి, నాగరాజుపాత్రో, ప్రేమలత, రాంబాబు, మనోజ్‌కుమార్, సీతయ్య, ఎ.నారాయణరావు, ఎస్.ఎల్. నారాయణరావు, కామేష్, కాశీప్రసాద్, వేణు, రంగారావు, మోహనరావు పాల్గొన్నారు.

**కొత్తూరు :** స్థానిక సివిల్ జడ్జి కోర్టులో మండల్ న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జి కందికట్ల రాణి ఆధ్వర్యాన లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో 182 కేసులు పరిష్కారమయ్యాయి. రాజీ పడదగిన క్రిమినల్ కేసులు 31, మనోవర్తి కేసులు 3, చెక్కు బౌన్స్ కేసు ఒకటి, గృహహింస కేసులు 2, ఎక్సైజ్ కేసులు 19, సివిల్ కేసులు 9, చిన్నచిన్న తగాదా కేసులు 118 పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్ మహంతి అప్పారావు, న్యాయవాదులు సుధాకరరావు, ధర్మారావు, గేదెల ఫాల్గుణరావు, రాడ రాజు, రవికిరణ్, హరిబాబు, ఉమామహేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

నగరంలోని విశాఖ ఎ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయ పనులను ఎమ్మెల్యే గొండు శంకర్ శనివారం పరిశీలించారు. ఆలయాల నిర్మాణంతో ఆ పరిసరాలు ఎంతో అభివృద్ధి చెందుతాయన్నారు. గతంలో మనం నిర్మించుకున్న ఆలయాలే ఆనాటి చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాండ్రంకి శంకర్, సింతు సుధాకర్, ముద్దాడ రామకృష్ణ, అంధవరపు సంతోష్, అంధవరపు ప్రసాద్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న జెఎసి నాయకులు

## ఆర్‌టిసి డిపో మేనేజర్‌కు సన్మానం

**పలాస:** పలాస ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎం.ఎస్.ఎస్.నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ కరుణశ్రీలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు గిరిజన నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జెఎసి జిల్లా అధ్యక్షులు సవర రాంబాబు, గిరిజన ఉద్యోగ సంఘ నాయకులు సవర జగన్నాయుకులు, ఎర్రన్న మాస్టారు, మోహనరావు, చంద్రశేఖర్, రమణారావు, వెంకటేష్, వరహాలమ్మ, శ్రీరంగులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

## నేడు ఎపి ఎన్‌జిఒ సమావేశం

**శ్రీకాకుళం సిటీ:** నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఎపి ఎన్‌జిఒ యూనియన్ సమావేశం నిర్వహించనున్నట్లు యూనియన్ ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరు కానున్నారన్నారు. సమావేశానికి నాయకులు, సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఫీల్డ్ అసిస్టెంట్‌గా వెంకటలక్ష్మి

ప్రజాశక్తి- లావేరు

వెంకటలక్ష్మి

మండల కేంద్రం లావేరు పంచాయతీ ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా లావేటిపాలెంకు చెందిన యినపకుర్తి వెంకటలక్ష్మిని కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించినట్లు ఎంపిడిఒ పి.వెంకటరాజు తెలిపారు. డ్వామా పీడీ ఉత్తర్వులు అనుసరించి నియామకపత్రాలు అందజేయడం జరిగిందని, సెప్టెంబర్ 11 నుంచి ఎఫ్ఎ విధుల్లో చేరినట్లు ఆయన తెలిపారు. గత ఫీల్డ్ అసిస్టెంట్ విధులకు డుమ్మా కొట్టడంతో పాటు ఆ పంచాయతీలో సుమారుగా రూ. 50 లక్షలుపైగా అవకతవకలు జరిగినట్లు ఇటీవల జరిగిన సామాజిక తనిఖీల్లో సర్వే బృందాలు వెల్లడించాయి. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించి కొత్తగా వెంకటలక్ష్మిని నియమించినట్లు ఎంపిడిఒ తెలిపారు.

## రైల్వే గేటు మూసివేత

**ఆమదాలవలస:** శ్రీకాకుళం రోడ్ పరిధిలోని ఊసవానిపేట రైల్వే క్రాసింగ్ గేటు ఆదివారం తాత్కాలికంగా మూసివేయనున్నట్లు సీనియర్ సెక్షన్ ఇంజనీర్ పి.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శ్రీకాకుళం రోడ్డు ఉర్లాం రైల్వేస్టేషన్ల మధ్య ట్రాక్ మెయింటినెన్స్ పనులు జరుగుతున్న కారణంగా రైల్వే గేటు మూసివేయబడుతుందని తెలిపారు. ప్రయాణికులు, వాహనదారులు ఈ విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని కోరారు.

## శక్తి యాప్‌పై అవగాహన

**నరసన్నపేట :** శక్తి యాప్‌ను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని హెచ్ సి నారాయణరావు సూచించారు. నరసన్నపేట కాలేజీ రోడ్డులో విద్యార్థినులకు మొబైల్ ద్వారా శక్తి యాప్ వినియోగంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ శక్తి యాప్ మీ సెల్‌ఫోన్‌లో ఉంటే పోలీసులు భద్రత ఉన్నట్టేనని అన్నారు. కార్యక్రమంలో విజియలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బూర్జ : ఈశ్వరరావును సన్మానిస్తున్న గోవిందరావు తదితరులు

## అనుభవానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి- కవిటి

వైసిపి సీనియర్ నాయకుడు పూడి నీలాచలం అనుభవానికి సముచిత ప్రాధాన్యత లభించిందని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్ అన్నారు. పంచాయతీ విభాగం రాష్ట్ర ఉమ్మడి కార్యదర్శిగా నియమితులైన పూడి నీలాచలంకు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నీలాచలంకు రాష్ట్రస్థాయి పదవి లభించడం హర్షం వ్యక్తం చేశారు. వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, మండలంలోని సర్పంచ్‌లు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

**నరసన్నపేట :** వైసిపి అనుబంధ విభాగం కార్యవర్గ సభ్యులుగా నియమితులైన రాష్ట్ర ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి జెన్ని అనిరుద్రుడు, జిల్లా ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు సతివాడ రామినాయుడు, జిల్లా కార్యదర్శి కోటిపల్లి శ్రీనివాస్, జిల్లా ఎస్‌సి సెల్ కార్యవర్గ సభ్యులు ఉంకిల్ గోపాలకృష్ణలను పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్యను సన్మానించారు.

**బూర్జ:** మండలంలోని మదనాపురంలో వైసిపి కార్యాలయంలో శనివారం వైసిపి జిల్లా ఎస్‌సి సెల్ కార్యవర్గసభ్యులుగా నియమితులైన ముద్దాడ ఈశ్వరరావును వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైసిపి మండల అధ్యక్షులు ఖండాపు గోవిందరావు ఈశ్వరరావును దుశ్శాలువ కప్పి సన్మానించారు. కొల్లివలస సర్పంచ్ జీడి వేణు, ఎంపిటిసి జి.సుధాకర్, ఎం.రామకృష్ణ, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

### ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

బిటి రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో రహదారులు, తాగునీరు, సాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనే తన లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని లోలుగు, పుల్లాజీపేట వద్ద చేపట్టిన బిటి రహదారుల నిర్మాణాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా రూపొందించడమే తన ఆశయమన్నారు. గత ప్రభుత్వం రహదారులను నిర్లక్ష్యం చేయడంతో ఎంతోమంది ప్రమాదాల బారినపడి నష్టపోయారన్నారు. కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికే పెద్దపీట వేసిందన్నారు. ముందుగా ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులు రూ.3.90 కోట్లుతో లోలుగు నుంచి వి.ఆర్‌గూడెం వరకు, రూ.3.80 కోట్లుతో పుల్లాజీపేట నుంచి బాణాం సమీపంలోని మూడు మర్రిచెట్లు వరకు నిర్మించిన రహదారులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ సత్యనారాయణ, ఇఇ తిరుపతిరావు, ఎఇఇ పి.టి.రాజు, పిఎసిఎస్ అధ్యక్షులు వండాన మురళీ, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన వెంకటసత్యనారాయణ, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, మాజీ ఎఎంసి చైర్మన్ అన్నెపు రాము, జిల్లా తెలుగు యువత కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడిన శ్లాబ్

## తప్పిన ప్రమాదం

### శ్లాబ్ పెచ్చులూడిన పోస్టల్ కార్యాలయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయం శ్లాబ్ పెచ్చులు శనివారం ఊడిపడ్డాయి. ఆ సమయంలో అక్కడ లేకపోవడం ప్రమాదం తప్పింది. ఉదయం తపాలా కార్యాలయం తెరవడంతో ఖాతాదారులు వచ్చి వారి కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు. ఆ సమయంలో ఒక్కసారి శ్లాబ్ పెచ్చులు పడ్డాయి. ఖాతాదారుడు తలపై చిన్న ముక్కలు పడడం వెంటనే మేల్కొని అందరినీ అప్రమత్తం చేశారు. పురాతనమైన భవనం కావడంతో గతంలోనూ ఇలా పెచ్చులు ఊడి పడ్డాయి. అప్పుడే పోస్టుమాస్టర్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినా ప్రయోజనం లేకుండాపోయింది. జిల్లా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఈ నెల 11, 12 తేదీల్లో వమరవల్లి డైట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ 2025 పోటీల్లో అత్యధిక విభాగాల్లో ప్రతిభ చూపి పలువురిని అబ్బురపరిచారు. అక్టోబరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా పరిషత్ పాఠశాల కొత్తపల్లి విద్యార్థులు ఎంపిక అయ్యారు. వీరు దృశ్య కళ 3డి విభాగం లో 'సేవ్ గర్ల్ చైల్డ్ థీమ్'కి నవదీప్, సాంప్రదాయ కథ చెప్పే విభాగంలో 'సిగ్గు ఒగ్గు - జబ్బు తగ్గు' అనే ఒగ్గు కథకు జ్ఞానశ్రీ, ప్రియాంకలు, థియేటర్ విభాగంలో 'బ్రహ్మ సమాజం'కు హేమని, సరిత, దివ్య, శ్రావణిలు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించారు. గ్రూపు 3డి దృశ్య కళలులో గిరి, మణికంఠలు ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి డైట్ ప్రిన్సిపాల్ గౌరీశంకర్, శ్రీకాకుళం డిప్యూటీ డిఇఒ విజయకుమారిలు బహుమతులు అందజేశారు. మొత్తం 12 విభాగాల్లో జిల్లాలో అత్యధికంగా మూడు స్థానాలు ఒకే పాఠశాల పొందడంపై పిల్లలను, గైడ్ టీచర్ షణ్ముఖరావును సహ ఉపాధ్యాయులు డి.మల్లేశ్వరరావులను ప్రధానోపాధ్యాయులు శాంతకుమారి, గ్రామస్తులు ప్రశంసించారు. కోటబొమ్మాళి మండలానికి ప్రస్తుతానికి ఇదే రికార్డు కావడం గమనార్హం.

ఎంపికైన విద్యార్థులు

## పది మంది ఎంపిక

**టెక్కలి రూరల్:** టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రాంగణలో నిర్వహించిన క్యాప్స్ ఇంటర్వ్యూలో హైదరాబాద్‌కు చెందిన ట్రైసోల్ గ్లోబల్ సర్వీస్ సాఫ్ట్‌వేర్ సంస్థకు పది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు ప్రస్తుతం నాల్గో సంవత్సరం చదువుతున్న కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డేటా సైన్స్ విభాగాలకు చెందిన వారు ఎంపికైన వారికి సంస్థ వార్షిక వేతనం రూ.5 లక్షలకు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరావు శనివారం తెలిపారు. ఐతమ్ కళాశాల విద్యార్థులు ప్రతిభతో సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు పొందడం గర్వకారణంగా భావిస్తూ... భవిష్యత్‌లో మిగతా విద్యార్థులు కూడా ఇలాంటి మంచి అవకాశాలు దక్కించు కోగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డాక్టర్ ఎం.సంతోష్‌లు విద్యార్థులను అభినందించారు.

## యూరియాపై ఆందోళన వద్దు

మాట్లాడుతున్న తహశీల్దార్ అప్పలస్వామి

**సోంపేట:** రానున్న వారం రోజుల్లో మండలానికి 60 టన్నులు యూరియా రానున్నదని తహశీల్దార్ అప్పలస్వామి, ఇఒ నరసింహ మూర్తి తెలిపారు. మండలంలోని మామిడిపల్లి, తాళ్లభద్ర, గొల్లూరు, రుషికుద్ద, ఎం.జి.పురం, కొర్లాంల్లో సరఫరా చేస్తామన్నారు. కొర్లాంలోని జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థ, సోంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, గ్రామ రెవెన్యూ అధికారులు వ్యవసాయ సహాయకులతో సమన్వయ సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సహాయకులు కూపనులు ఇచ్చిన ప్రాప్తికి ఆయా ఆయా ఏజెన్సీలు రైతులకు యూరియా రైతు సేవా కేంద్రాల వద్దనే పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల ఆఖరి వరకు మొత్తం 180 టన్నుల యూరియా సరఫరాకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.


బోరు మరమ్మతులను పరిశీలిస్తున్న సర్పంచ్ ప్రతినిధి గిరిబాబు

## బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి- పొందూరు

మంలంలోని రాపాకలో గుమ్మానవీధిలో పాడైపోయిన తాగునీటి బోరుకు మరమ్మతులను శనివారం సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు ఆధ్వర్యంలో చేపట్టారు. తాగునీటి బోరు ఐరన్ కేసింగ్ పైపులు పూర్తిగా పాడైపోవడంతో వినియోగానికి పనికి రాకుండా పోయింది. గ్రామంలో అత్యధిక మంది ఈ బోరునీటిని వినియోగిస్తున్నారు. దీంతో పాడైపోయిన బోరు ఐరన్ కేసింగ్ పైపులను తొలగించి వాటి స్థానంలో ప్లాస్టిక్ కేసింగ్ పైపులను వేసినట్లు ఆయన తెలిపారు. తాగునీటి బోరుకు త్వరితగతిన మరమ్మతులు పూర్తిచేసి త్వరితగతిన వినియోగానికి తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

## గుర్తు తెలియని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బొంతుపేట గ్రామ సమీపంలోని శ్మశానం వెనుక ఉన్న పొలాల్లో గుర్తు తెలియని సుమారు 60 ఏళ్ల పైబడిన వృద్ధుని మృతదేహం గ్రామస్తులు శనివారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ జి.లక్ష్మణరావు సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఒంటిపై తెలుపురంగు ఫుల్ హ్యాండ్ బనియన్, పక్కన చేతికర్రతో పడి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే లావేరు పోలీస్‌స్టేషన్ 6309990851 నంబర్‌కు సమాచారాన్ని అందించాలన్నారు. అనంతరం మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి మార్చురీలో భద్ర పర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

డాక్టర్ శశిధర్‌ను సన్మానిస్తున్న వైద్యులు

## ప్రాథమిక చికిత్స కీలకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, డాక్టర్ శశిధర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో పిఎంపిలకు శనివారం ప్రథమ చికిత్స, సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రథమ చికిత్స ఏ విధంగా చేయాలి, ఏ విధంగా రోగి ప్రాణాలు కాపాడాలి, ప్రస్తుతం సంభవిస్తున్న సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శశిధర్ మాట్లాడుతూ పాముకాటు, పిట్స్, హార్ట్‌స్ట్రోక్, బ్రెయిన్ స్ట్రోక్, సీజనల్ జ్వరాలను ప్రాథమిక దశలో గుర్తించి సకాలంలో వైద్యం అందించి హయ్యర్ సెంటర్‌కి పంపిస్తే సేవ్ చేయవచ్చునన్నారు. అనంతరం ఈ అవగాహన సదస్సులో పాల్గొన్న సభ్యులందరికీ సర్టిఫికెట్‌ను అందజేశారు. శశిధర్ ఆస్పత్రి ఎండి డాక్టర్ అన్నెపు శశిధర్ సంఘ సభ్యులు దుశ్శాలువ కప్పి మెమొంటోను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు కిషోర్, జనరల్ సర్జన్ డాక్టర్ సిహెచ్ గోవిందరావు, జిల్లా అధ్యక్షులు వండాన శిమ్మన్న, కార్యదర్శి నక్క లక్ష్మీనారాయణ, ట్రెజరర్ కె.జనార్ధనరావు, సహాయ కార్యదర్శి చిన్నాల రాము, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పాల్గొన్నారు.

జిల్లేడు ద్రావణాన్ని తయారు చేస్తున్న రైతులు

## జిల్లేడు ద్రావణం తయారీ

**కవిటి:** మండలంలోని కొర్రాయిపుట్టుగలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై డిఎంఎంటి తులసయ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సీజన్‌లో వరి పంటలో కనిపిస్తున్న పోటాష్ లోపం నివారణకు సామూహికంగా 200 లీటర్ల జిల్లేడు ద్రావణం తయారీ చేపట్టారు. ఈ ద్రావణం మూడు రోజుల్లో సిద్ధమవుతుందని, అనంతరం 10 లీటర్ల జిల్లేడు ద్రావణాన్ని వంద లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే పోటాష్ లోపం, సూక్ష్మపోషకాల లోపం నివారణతో పాటు రసం పీల్చే పురుగుల నివారణకు కూడా ఉపయోగపడుతుందని తులసయ్య తెలిపారు. ముఖ్యంగా రసాయన ఎరువులు అధికంగా వాడటం వల్ల భూమి సారం తగ్గిపోతోందని, ఆహార భద్రతకు ముప్పు ఏర్పడుతోందని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో స్థానిక వనరులతో తయారు చేసే ద్రావణాలు, కషాయాలు వాడడం ద్వారా భూమి సహజ తత్వాన్ని కాపాడటంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో మహిళా రైతులు, ఐసిఆర్‌పిలు సంతోషి, జయ పాల్గొన్నారు.

## సజావుగా యూరియా పంపిణీ

**రణస్థలం:** మండలంలో యూరియా పంపిణీని మండలం వ్యవసాయ అధికారి డి.విజయ్ భాస్కర్ శుక్రవారం పరిశీలించారు. జెఆర్‌పురం మన గ్రోమోర్ సెంటర్, నాయుడు ఫర్టిలైజర్స్ రావాడ, శ్రీ శ్రీనివాస ఎంటర్ప్రైజెస్, కోష్ట షాపులకు మొత్తం 45 టన్నులు యూరియా రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు కూపన్లు రైతులకు ముందుగా ఇచ్చి ప్రైవేటు షాప్ దగ్గర రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో సరఫరా చేయడం జరిగిందన్నారు. రణస్థలం, రావాడ, సంచాం రైతులకు వ్యవసాయశాఖ ద్వారా కూపన్లు పొందిన రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు.

## రాములు హత్య దారుణం

**పలాస:** మండలంలోని కేశపురానికి చెందిన ఉంగ రాములును ఇటీవల చేతబడి చేశారంటూ హత్య చేయడం దారుమని మూఢ నమ్మకాలు నిర్మూలన సంఘం జిల్లా అధ్యక్షులు పిట్ట గీతారాణి, ఉపాధ్యక్షులు నగరి కరుణాకర్ మాస్టారు, జిల్లా కార్యదర్శి తుంగాన సూర్య మాస్టారు అన్నారు. ఈ మేరకు రాములు కుటుంబ సభ్యులను మూఢనమ్మకాల నిర్మూలన, పౌర హక్కుల సంఘం, దేశభక్త ప్రజాతంత్ర సంఘం సభ్యులు శనివారం పరామర్శించారు. అనంతరం నినాదాలు చేశారు. జరిగిన సంఘటన గల కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు మరలా పునరావృతం కాకుండా ఉండేందుకు ఎలా ఉండాలని వాళ్లకు సూచించారు. వారితో పాటు భీమారావు మాస్టారు, పద్మ లోచన మాస్టారు, మౌలి మాస్టర్, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిరి దానేష్ ఉపాధ్యక్షులు, సోమనాదం సభ్యులు వైకుంఠం, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం బాధ్యులు పులారి దుర్యోధన, పిట్ట జోగారావు, మామిడి గణపతి ఉన్నారు.

నినాదాలు చేస్తున్న సంఘ సభ్యులు

# పాత పెన్షన్ వర్తింపజేయాలి

పోలాకి : ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57 ప్రకారం డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపు చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో డిఎస్‌సి 2003 ఫోరం జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందించే కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయుల డిమాండ్ న్యాయ సమ్మతమైనదని, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి ప్రభుత్వపరంగా తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఫోరమ్ సభ్యులు తెలిపారు. రాష్ట్ర కన్వీనర్ బలగ శ్రీనివాసరావు, జిల్లా కో-కన్వీనర్లు దువ్వల శివరాంప్రసాద్, గురుగుబెల్లి భాస్కరరావు, అట్టాడ తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

**రణస్థలం:** 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపు చేయాలని స్థానిక ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావుకు 2003 డిఎస్‌సి ఫోరం రాష్ట్ర కన్వీనర్ బలగ శ్రీను, మండల కన్వీనర్ కె.శ్రీధర్, జి.చిన్నకృష్ణనాయుడు వినతిపత్రం అందజేశారు.

**పోలాకి:** కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపచేయమని కోరారు. ఈ మేరకు డిఎస్‌సి 2003 ఫోరం జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి ఆధ్వర్యాన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా కో-కన్వీనర్లు అట్టాడ తిరుమలేశ్వరరావు, అంబటి లక్ష్మణ్, గురుగుబెల్లి భాస్కరరావు, మానెం చిరంజీవి, పిఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శి భావన మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

చెత్త తొలగింపును పరిశీలిస్తున్న శ్రీనివాసరావు, నాయకులు

## సొంత నిధులతో చెత్త తొలగింపు

ప్రజాశక్తి- పొందూరు

గ్రామంలో రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారాలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి సొంత నిధులతో మండల తెలుగుయువత అధ్యక్షుడు కండాపు శ్రీనివాసరావు పారిశుధ్య పనులను చేపట్టారు. మండలంలోని రాపాక పంచాయతీ పరిధిలోని ఇల్లయ్యగారిపేటలో రహదారి పక్కన, చెరువు గట్టుపై చెత్తాచెదారాలు పేరుకు పోయాయి. వర్షాకాలం కావడంతో చెత్తాచెదారాలు కారణంగా సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నామంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలను గుర్తించిన శ్రీనివాసరావు జెసిబి, ట్రాక్టర్లు సహాయంతో చెత్తాచెదారాలను తొలగించి దూర ప్రాంతాలకు తరలించి శుభ్రం చేశారు. ఎంతో కాలంగా నెలకొన్న సమస్యను పరిష్కరి ంచడంతో గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## జెడ్‌పి చైర్‌పర్సన్ పరామర్శ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని ఇన్నీస్‌పేటలో వైసిపి నాయకులు ఇసురు పరశురాం మాతృమూర్తి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ శనివారం పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, వైస్ ఎంపిపి దువ్వు వివేకానంద రెడ్డి, మండల పార్టీ ప్రెసిడెంట్ పాతిర్ల రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్ ప్రతినిధి ఇసురు తులసీరాం, ఆశి పురుషోత్తంరెడ్డి, ఆశి కృష్ణారెడ్డి, సారధి, బాలరాజు, ఆనంద్, యాదవ్‌రెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.

## శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు

ప్రజాశక్తి- కవిటి

శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు

మండలంలోని ముత్యాలపేటలో ఉన్న మహామృత్యుంజయని ఆలయంలోని శివలింగాన్ని శనివారం ఉదయం సూర్యకిరణాలు తాకాయి. ఆలయ గర్భగృహంలోకి ప్రవేశించిన కిరణాలు శివలింగంపై పడిన క్షణాలను యాత్రికులు దర్శించుకున్నారు. అందులోనూ శివలింగం సగం భాగానికే కిరణాలు తాకడంతో అది అర్ధనారీశ్వర రూపంలో ప్రతిబింబించింది. ఈ విశేష దృశ్యం వార్త తెలిసిన వెంటనే స్థానికులు, పరిసర గ్రామాల యాత్రికులు ఆలయానికి పోటెత్తారు. సూర్యకిరణాలు శివలింగాన్ని ఆవరించిన ఆ క్షణం యాత్రికుల హృదయాల్లో ఆధ్యాత్మిక ఉల్లాసాన్ని నింపగా, హరహర మహాదేవ్ నినాదాలతో ఆలయం మారుమోగింది.

## ఇస్కఫ్ లక్ష్యసాధనకు కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసి, సంస్థ లక్ష్యాల సాధనకు కృషి చేస్తామని ఇస్కఫ్ జిల్లాశాఖ అధ్యక్షులు బుడుమూరు వెంకట సూర్యనారాయణ రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌విడి కళ్యాణ మండపంలో శనివారం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికకు ముఖ్య నిర్వహణ అధికారిగా ఇస్కఫ్ రాష్ట్ర శాఖ కార్యదర్శి సనపల నర్సింహులు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల మధ్య స్నేహం, సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో పనిచేస్తున్న ఏకైక అంతర్జాతీయ సంస్థ ఇస్కఫ్‌లో సభ్యులుగా చేరాలన్నారు. సంఘం గౌరవ అధ్యక్షులు బుడుమూరు శ్రీరామమూర్తి మాట్లాడుతూ ప్రపంచ శాంతి నెలకొల్పేందుకు ఇస్కఫ్ కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బుడుమూరు శ్రీరామమూర్తి, గౌరవ సలహాదారునిగా గేదెల ఇందిర ప్రసాద్, అధ్యక్షునిగా బి.వి.ఎస్.ఎన్.రాజు, ఉపాధ్యక్షులుగా సనపల నారాయణరావు, సీపాన రామారావు, టి.కామేశ్వరి, సాహుకారి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జి.వి. నాగభూషణరావు, కోశాధికారిగా కె.భాస్కరరావు, కార్యదర్శిగా గురుగుబెల్లి రాజేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా దిబ్బ ప్రసాదరావు, గేదెల లక్ష్మి, టి.తిరుపతిరావు, సాధు కామేశ్వర రావు, కార్యవర్గ సభ్యులుగా నాగేశ్వరరావు, ఈశ్వరరావు, చౌదరి సత్యనారాయణ, వడ్డాది విజయ కుమార్, కుంచి చిన్నారావు, టి.వి.రమణ, తంగి ఎర్రమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఇస్కఫ్ జిల్లా సంఘం నాయకులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, జిల్లా శాఖ మాజీ అధ్యక్షులు మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కఫ్ నూతన కార్యవర్గం

కవిటి : హిందీ అక్షరాల ఆకారంలో విద్యార్థులు

## ఘనంగా హిందీ భాషా దినోత్సవం

ప్రజాశక్తి- కవిటి

భారతీయ విద్యాకేంద్రం వారి ఆర్ష విజ్ఞాన భారతి పాఠశాలలో హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను హిందీ అ, ఆ అక్షరాల ఆకృతిలో కూర్చోబెట్టగా, భాషపై ఆకర్షణ కలిగించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యుడు ఎం.అనిల్ మాట్లాడుతూ హిందీ భాష దేశ సమైక్యతకు ప్రతీకగా నిలుస్తుందని, విద్యార్థులు భాషా వైవిధ్యాన్ని అర్థం చేసుకొని గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీష, సుహాసిని, జ్యోతి, అంజలి, ఢిల్లీరావు, మాదికమ్మా, లక్ష్మి, రాజేశ్వరి, సరిత, కృష్ణకుమార్, ధర్మారావు, నిర్మల పాల్గొన్నారు.

**పలాస :** కాశీబుగ్గ చినబడాం ఉన్నత పాఠశాలలో హిందీ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు హిందీ అక్షరాలు అ, ఆ ఆకారంలో కూర్చున్నారు. ప్రధానోపాధ్యాయులు చింతాడ ఉషారాణి ప్రశంసించారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు గేదెల జగదీశ్వరరావు, షణ్ముఖరావు, మన్మధరావు, గోవిందరావు జయలక్ష్మి, నగేష్, హిందీ ఉపాధ్యాయులు గూన మోహినమ్మ పాల్గొన్నారు.

# ఎంటిఎస్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పొందూరు

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఎంటిఎస్ ఉపాధ్యాయులు

1998 డిఎస్‌సి ఎంటిఎస్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం మండలంలోని లోలుగులో ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ఏపి డిఎస్‌సి (ఎంటిఎస్) టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా 2025 జూన్‌లో జరిగిన కౌన్సిలింగ్‌లో సుమారు 200 కిలోమీటర్లపైన రవాణా సౌకర్యం లేని దూర ప్రాంతాలకు తమను బదిలీ చేశారని తెలిపారు. అలాగే 11 నెలల వేతనం, బేసిక్ పే తప్ప తమకు హెచ్‌ఆర్‌ఎ, టిఎ, డిఎ వంటి ఏవిధమైన అలవెన్సులు లేవని వాపోయారు. తమ వయసు, ఆరోగ్యరీత్యా మరలా కౌన్సిలింగ్ నిర్వహించి తమను తమ స్వంత ప్రాంతాలకు దగ్గరలో వర్క్ అడ్జస్టుమెంట్ చేయాలని కోరారు. వినతిపత్రాన్ని అందించిన వారిలో పలువురు ఎంటిఎస్ ఉపాధ్యాయులు ఉన్నారు.

## పాఠశాల అభివృద్ధికి కృషి

**పలాస :** పలాస ప్రభుత్వ హైస్కూల్ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం కుటుంబీకులు కుమారుడు కణితి రాజేంద్ర, కుమార్తె కణితి శారదలు వెల్లడించారు. స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన విశ్వనాథం విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే పాఠశాల మధ్య ఖాళీగా ఉన్న స్థలంలో రూ.పది వెచ్చించి రూఫ్ వేశామన్నారు. పాఠశాలలో స్టేజ్, ఆడిటోరియం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. విశ్వనాథం పలాస జూనియర్ కళాశాలకు 3.60 ఎకరాలు భూమిని ఇచ్చారని గుర్తు చేశారు. దీనిలో రూ.5 కోట్లతో స్టేడియం నిర్మాణానికి ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రభుత్వానికి లేఖ రాశారని అన్నారు. పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు నేత్ర, కేన్సర్ ఆస్పత్రికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేను కోరామన్నారు. కార్యక్రమంలో పాలవలస వైకుంఠరావు, ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

అభినందిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

## రామారావుకు అభినందనలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాలో యోగ విద్యకు ప్రాణం పోసిన గొప్ప వ్యక్తి యోగా రామారావు మాస్టార్ అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని బలగ కాలభైరవ దేవాలయంలో శనివారం రామారావు మాస్టర్ అభినందన సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో యోగాను ప్రారంభించి దేశంలోని, ఇతర రాష్ట్రాలు, పలు దేశాల్లో శిష్యగణం ఉన్న గొప్ప వ్యక్తి రామారావు అని ప్రశంసించారు. విశ్రాంత న్యాయమూర్తులు పప్పల జగన్నాథం, సింగయ్య, వాకర్స్ ఇంటర్నేషనల్-102 గవర్నర్ కొంక్యాన మురళీధర్, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు యోగా గురువు రామారావు మాస్టార్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గణేష్‌స్వామి, వాణిసుకన్య, యోగా గురువులు, యోగాభ్యాసకులు భ ద్రాచలం ప్రసాద్, యోగ సాధకులు రమణమూర్తి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎపిసి శశిభూషణ్

## అత్యుత్తమ ఫలితాలకు కార్యాచరణ

ప్రజాశక్తి- పొందూరు

కెజిబివి పాఠశాలల్లో పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నట్లు సమగ్రశిక్ష ఎపిసి ఎస్.శశిభూషణ్ అన్నారు. పొందూరు కెజిబివిని శనివారం ఆయన పరిశీలించారు. కెజిబివిల్లో అమలు చేస్తున్న విద్యాపథం కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. పదోతరగతి, ఇంటర్మీడియట్‌కు సంబంధించి పూర్తిచేసిన సిలబస్, పాఠశాలలోని విద్యాబోధన, మెనూ కోసం విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ఈ-పాస్ మిషన్ పనితీరుపై డీలర్‌కు సూచనలిస్తున్న ఆర్‌ఐ రాంబాబు

## సకాలంలో కార్డుల పంపిణీ

ప్రజాశక్తి- లావేరు

చౌకడిపోల్లో కార్డుదారులకు స్మార్ట్ రైస్ కార్డులతో పాటు సరుకులు సకాలంలో అంద జేయాలని సివిఎస్ఆర్ ఐ.రాంబాయి అన్నారు. మండలంలోని తాళ్లవలస రేషన్ డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొత్తగా ఇచ్చిన ఈ-పాస్ మిషన్ను పనితీరును పరిశీలించారు. ఈ కొత్త ఈ-పాస్ మిషన్ల పనితీరు ఎటువంటి ఆటంకం లేకుండా త్వరితగతిన సిగ్నల్ వస్తుందని, పంపిణీలో ఎటువంటి ఆలస్యం లేకుండా సరుకులు, కార్డులు అందజేయాలని సూచించారు. డిపోల వద్ద తప్పనిసరిగా బోర్డులు, ధరల పట్టిక, క్యూఆర్ కోడ్ ఉండాలన్నారు. అనంతరం కార్డు దారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం లో డీలర్ ముప్పిడి రమేష్, కార్డుదారులు ఉన్నారు.